ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
శుక్రవారం 12 జూలై 2024







రథం లాగుతున్న భక్తులు

# నేత్రపర్వంగా నటరాజస్వామి రథోత్సవం



ముచ్చటగా మూడు రథాల ఊరేగింపు

● హరోం హర' నినాదంతో మార్మోగిన చిదంబరం



ఉరేగింపులో ఆలయ ఏనుగు



ఉత్సవమూర్తిని ఊరేగిస్తున్న దృశ్యం



శంఖం ఊదుతున్న శివభక్తుడు

పెరంబూర్, జూలై 11: సుప్రసిద్ధ శైవక్షేత్రం చిదంబరం నటరాజస్వామివారి ఆలయ ఆణి బ్రహోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం రథోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఈ ఆలయ ఆణి బ్రహోత్సవాలు ఈ నెల 3న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం స్వర్ణ, రజత వాహనాలు సహా వివిధ రకాల వాహనాల్లో పంచమూర్తులు ఊరేగారు. బుధవారం స్వర్ణ రథంలో భిక్షాటన ఊరేగింపు జరిగింది. బ్రహోత్సవాల్లో కీలకఘట్టమైన రథోత్సవం గురువారం ఉదయం ప్రారంభమైంది. మూలవర్లు శ్రీమద్ నటరాజస్వామి, శివకామసుందరి అమ్మవారు సర్వాలంకరణతో మహారథంపై ఆసీనులయ్యారు. సుబ్రహ్మణ్యస్వామి, వినాయకస్వామి, చండికేశ్వరస్వామి వార్లు వేర్వేరు రథాల్లో కొలువుదీరారు. శైవాగమ పండితుల వేద మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ ఉదయం ఎనిమిది గంటలకు తూర్పు వీధి రథమండప ప్రాంతం నుంచి ముందుగా మహారథం, దాని వెనుమే మరో మూడు రథాలు బయలుదేరాయి. ఈ రథోత్సవంలో వేలాదిమంది భక్తులు పాల్గొని 'ఓం నమశ్శివాయ, హరోం హర' అంటూ భక్తిపారవశ్యంతో నినాదాలు చేశారు. దక్షిణ వీధి, ఉత్తర వీధి, పడమటి వీధుల మీదుగా ఈ రథాలను ఊరేగించారు. నాలుగు వీధులలోనూ మండకపడిత్తార్లు రథంపై ఊరేగుతున్న నటరాజస్వామి, శివకామసుందరి అమ్మవారు, ఇతర దేవతామూర్తులకు ప్రత్యేక నైవేద్యాలను సమర్పించారు. ఈ రథాల ఊరేగింపు ప్రారంభానికి ముందే మార్గాల్లో హిందూ ఆలయ సంరక్షణ కమిటీ సభ్యులు, థిల్లై తిరుమురై కళగం, అప్పర్ సేవా సంస్థకు చెందిన శివభక్తులు మహిళలు నాలుగు వీధులను శుభ్రం చేసి రంగవల్లులు తీర్చిదిద్దారు. రథాల ముందు భక్తులు పరమశివుడి వేషధారణలతో నృత్యాలు చేశారు. పలు ప్రాంతాల నుండి విచ్చేసిన శైవ సంఘాల ప్రతినిధులు చండీ మేళం వాయిస్తూ దారిపొడవునా నృత్యం చేశారు. భక్తజన సందోహంతో ఈ రథాల ఊరేగింపు సాయంత్రం ఆరుగంటలకు తూర్పువీధిలో రథమంటప ప్రాంతం వద్ద ముగిసింది. ఈ ఉత్సవంలో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు, పోలీసుల భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. వివిధ భక్త సంఘాలు వేడుకల్లో పాల్గొన్న భక్తులకు మజ్జిగ, పానకాలు పంపిణీ చేశారు. వేడుకల్లో భాగంగా శుక్రవారం వేకువజామున 3 నుంచి ఉదయం 6 గంటల వరకు శివకామసుందరి సమేత నటరాజమూర్తికి మహా అభిషేకం జరుగనుంది. ఉదయం 10 గంటలకు చిత్ సభలో రహస్య పూజలు, పంచమూర్తుల ఊరేగింపు అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు ఆణి తిరుమంజన దర్శనం, జ్ఞానకాశచిత్ సభ ప్రవేశం జరుగనుంది. శనివారం పంచమూర్తి ముత్యాల పల్లకిలో ఊరేగనున్నారు.

---

రాష్ట్రంలో వరుస ఓటములు

# అయినా కళ్లు తెరవని బీజేపీ సర్కారు

**రాష్ట్రానికి నిధులివ్వకుండా నిర్లక్ష్యం ● ధర్మపురి సభలో సీఎం స్టాలిన్ ధ్వజం**



పాళయంపుదూరు సభలో మహిళకు ఇంటి పత్రాన్ని అందజేస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరుసగా ఓటమిపాలవుతున్నా, జాతీయ స్థాయిలో గతంలా మెజారిటీ రాకపోయినా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇంకా గుణపాఠం నేర్చుకోలేదని, ఆ ప్రభుత్వానికి ఇంకా కనువిప్పు కలగలేదని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధ్వజమెత్తారు. రాష్ట్రానికి నిధులివ్వకుండా కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ధర్మపురి జిల్లా పాళయంపుదూరు పంచాయతీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం ఉదయం 'ప్రజలతో ముఖ్యమంత్రి' అనే పథకానికి ఆయన శ్రీకారం చుట్టారు. ఆ సందర్భంగా జరిగిన సభలో సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో రెండో విడత మెట్రోరైలు ప్రాజెక్టుకు సాంకేతిక అనుమతిచ్చిన బీజేపీ ప్రభుత్వం ఆ ప్రాజెక్టుకు ఇంతవరకూ నిధులివ్వకుండా మొండిగా ప్రవర్తిస్తోందని ఆరోపించారు. పదేళ్ల బీజేపీ పాలనలో రాష్ట్రానికి ఎలాంటి పథకాలు మంజూరు చేయలేదని, ఈ పరిస్థితుల్లో తాజా లోక్‌సభ ఎన్నికల్లో తమిళ ఓటర్లు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిని చిత్తుగా ఓడించినా, జాతీయ స్థాయిలో మునుపటిలా మెజారిటీ రాక రెండు మిత్రపక్షాల మద్దతుతో ప్రభుత్వాన్ని నడుపుతున్నా ఆ పార్టీ పాలకుల వైఖరి ఏ మాత్రం మారలేదన్నారు. శాసనసభ ఎన్నికలకు ముందు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ పర్యటించి ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నానని, అలా ప్రజలతో భేటీ కావడాన్ని 'మీ నియోజకవర్గంలో స్టాలిన్' అనే పేరుతో అన్ని నియోజకవర్గాల్లోనూ పర్యటించానని చెప్పారు. ప్రస్తుతం నగరాలకే పరిమితమైన 'ప్రజలతో ముఖ్యమంత్రి' పథకాన్ని గ్రామీణ ప్రాంతానికి విస్తరింపజేశానని, ఆ మేరకు ఇకపై గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలను కూడా కలుసుకుని వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. రాజధాని చెన్నైలోని కొళత్తూరు మాత్రమే తన నియోజకవర్గం కాదని, రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలూ తనవేనని, రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రిగా సేవ చేయడమే తన విద్యుక్త ధర్మమని చెప్పారు. ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు తన పర్యటనలో ఫిర్యాదుల పెట్టెల ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, అధికారంలోకి రాగానే వంద రోజుల్లో ఆ ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించానని తెలిపారు. ఇక 'ముదల్వరిన్ ముగవరి' (ముఖ్యమంత్రి చిరునామా) పేరుతో ఆరులక్షలకు పైగా ప్రజలనుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలను పరిష్కరించానని చెప్పారు. గతంలో ధర్మపురిలో మూడువేలకుపైగా ఫిర్యాదులు స్వీకరించి ముప్పై రోజులల్లో ప్రజల కోర్కెలన్నింటినీ నెరవేర్చినట్లు ఆయన వివరించారు. ఈ సమావేశంలో ఆయన ధర్మపురి ప్రాంతంలో అమలు చేయనున్న పథకాలు గురించి ప్రకటన చేశారు. ఆ మేరకు రూ.51 కోట్లతో అరూరు ప్రభుత్వ ఆస్పత్రిలో అభివృద్ధి పనులు చేపట్టనున్నామని, ధర్మపురం వెన్నంపట్టి రోడ్డులో కొత్తగా రైల్వే ఫ్లైఓవర్‌ను రూ.38 కోట్లతో నిర్మించనున్నామని, అరూరు నగర పంచాయతీని మున్సిపాలిటీ స్థాయికి పెంచనున్నామని చెప్పారు. పంజపల్లి, రాజపాళయం ఆనకట్టలను మరమ్మతు చేస్తామని, సిట్లింగ్, ప్రభుత్వం నత్తం ప్రాంతాల్లో గిరిజనులు ఉత్పత్తి చేసే రాగి, సజ్జలు నిల్వ చేసుకునేందుకు గోదాము నిర్మిస్తామని, పాళయంపుదూరు ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో తరగతి గదులను పునర్నిర్మిస్తామని తెలిపారు. ఈ సభలో 2637 మంది లబ్దిదారులకు వివిధ సంక్షేమ పథకాల కింద సహాయాలను పంపిణీ చేసి, మహిళలు ఉచితంగా ప్రయాణించడానికి 20 బస్సులను కూడా ప్రారంభించారు. ఈసభలో మంత్రులు కేఎన్ నెహ్రూ, ఎంఆర్కే పన్నీర్‌సెల్వం, ఎంపీ మణి, శాసనసభ్యుడు జీకే మణి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, ముదల్వరిన్ ముగవరి శాఖ ప్రత్యేక అధికారి మోహన్, జిల్లా కలెక్టర్ శాంతి తదితరులు పాల్గొన్నారు.

---

# 20 రౌండ్లుగా విక్రవాండి ఓట్ల లెక్కింపు

● జిల్లా కలెక్టర్ పళని



స్ట్రాంగ్ రూమ్ వద్ద కేంద్ర పారా మిలిటరీ బలగాలు

పెరంబూర్, జూలై 11: విక్రవాండి శాసనసభ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు శనివారం జరుగనుంది. ఓట్ల లెక్కింపుకు 14 బల్లలు ఏర్పాటుచేయగా, 20 రౌండ్లలో లెక్కిస్తారని విల్లుపురం జిల్లా కలెక్టర్ పళని తెలిపారు. బుధవారం పోలింగ్ ముగిసిన అనంతరం ఓట్ల లెక్కింపు జరుగనున్న పనయపురం ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎం బాక్స్‌లు తరలించారు. జిల్లా కలెక్టర్ పళని, ఎన్నికల పరిశీలకులు అమిత్‌సింగ్ బన్సాల్, విక్రవాండి ఉప ఎన్నిక అధికారి చంద్రశేఖర్ పర్యవేక్షణలో స్ట్రాంగ్ రూమ్‌కు సీలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఉప ఎన్నికలో 276 పోలింగ్ కేంద్రాల్లో వినియోగించిన ఈవీఎంలను భారీ భద్రత నడుమ స్ట్రాంగ్ రూమ్‌కు తరలించామన్నారు. శనివారం ఓట్ల లెక్కింపునకు 14 బల్లలు, తపాలా ఓట్ల లెక్కింపుకు మరో రెండు బల్లలు ఏర్పాటుచేశామన్నారు. తపాలా ఓట్ల లెక్కింపు ఒక రౌండ్‌లో పూర్తవుతాయని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద మూడు షిఫ్టు పద్ధతిలో 24 గంటల పోలీసు భద్రత కల్పించామన్నారు. ఈ ప్రాంతాన్ని సీసీ కెమెరాలతో పర్యవేక్షించడంతో పాటు 150 మంది పోలీసులు భద్రతా విధులు చేపట్టారని కలెక్టర్ తెలిపారు.

---

# స్థానిక సమస్యలపై ఉద్యమించండి

● వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బలమైన కూటమితో పోటీ

● అన్నాడీఎంకే శ్రేణులకు ఈపీఎస్ పిలుపు



అళగు ముత్తుకోన్‌కు నివాళులర్పిస్తున్న అన్నాడీఎంకే నేతలు

పెరంబూర్, జూలై 11: స్థానిక సమస్యలపై ఉద్యమించాలని పార్టీ శ్రేణులకు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలోని 39 నియోజకవర్గాల్లో పోటీచేసిన అన్నాడీఎంకే ఘోరపరాజయం చవిచూసింది. 9 నియోజకవర్గాల్లో 3వ స్థానం, ఒక నియోజకవర్గంలో 4వ స్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో, నియోజకవర్గాల వారీగా పార్టీ నిర్వాహకులతో పార్లమెంటు ఎన్నికలపై సమీక్షా సమావేశాలు నిర్వహించాలని ఈపీఎస్ నిర్ణయించారు. ఆ ప్రకారం, బుధవారం కాంచీపురం, శ్రీపెరుంబుదూర్ తదితర లోక్‌సభ నియోజకవర్గాల జిల్లా కార్యదర్శులు, పార్టీ నిర్వాహకులు, అభ్యర్థులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం గురువారం శివగంగ, వేలూరు, తిరువణ్ణామలై తదితర లోక్‌సభ నియోజకవర్గాల నిర్వాహకులతో రాయపేటలోని పార్టీ కార్యాలయంలో ఈపీఎస్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు నేతలు... ఈ ఎన్నికల్లో బలమైన కూటమి లేకపోవడం వల్లే ఓటమి చెందామని అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం ఈపీఎస్ మాట్లాడుతూ... శివగంగ నియోజకవర్గంలోని 4 శాసనసభ నియోజకవర్గాల్లో అన్నాడీఎంకే అభ్యర్థులు రెండింటిలో మూడో స్థానంలో నిలిచారన్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వేరు, శాసనసభ ఫలితాలు వేరుగా ఉంటాయన్నారు. 2026లో జరుగనున్న శాసనసభ ఎన్నికలు తమ పార్టీకి అనుకూలంగా ఉంటాయని తెలిపారు. ఈ విషయాన్ని గ్రహించి నేతలు, కార్యకర్తలు ఐకమత్యంతో, రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలని సూచించారు. పంచాయతీ, మున్సిపాలిటీల వారీగా సమావేశాలు నిర్వహించాలన్నారు. స్థానికంగా నెలకొన్న సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి ప్రజలతో కలసి పోరాడాలని పిలుపునిచ్చారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో బలమైన కూటమిగా అన్నాడీఎంకే పోటీచేస్తుందని పళనిస్వామి తెలిపారు. సమావేశంలో పార్టీ ప్రిసీడియం చైర్మన్ తమిళ్‌మగన్ హుస్సేన్, మాజీ మంత్రులు నత్తం విశ్వనాథన్, కేపీ మునుస్వామి, ఎస్పీ వేలుమణి, దిండుగల్ శ్రీనివాసన్ తదితరులు కూడా పాల్గొన్నారు. కాగా భారత స్వాతంత్ర్యసమరంలో పాల్గొన్న మొట్టమొదటి యోధుడు అళగు ముత్తుకోన్ 267వ జయంతిని పురస్కరించుకుని ఎగ్మోర్‌లోని ఆయన విగ్రహానికి ఎడప్పాడి బృందం పుష్పమాల వేసి నివాళులర్పించారు.

---



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

# రైల్వే గోదాములో భారీ అగ్నిప్రమాదం

చెన్నై, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పెరంబూరు గ్యారేజీ రైల్వేస్టేషన్ సమీపం, ఫిలిప్స్ రోడ్డులో ఉన్న రైల్వే గోడౌన్‌లో గురువారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ కారణంగా కోట్లాది రూపాయల విలువైన పరికరాలు, వస్తువులు దగ్ధమయ్యాయి. ఆ గోదాములో సమాచార శాఖకు సంబంధించిన సిగ్నల్ పరికరాలు, విద్యుత్ తీగలు, కేబుల్స్, ప్లాస్టిక్ పైపులు భద్రపరుస్తున్నారు. ఇనుప వస్తువులు, పరికరాలు కూడా ఎక్కువగా నిల్వచేస్తుంటారు. గురువారం ఉదయం 8 గంటల ప్రాంతంలో ఉన్న ఆ గోదాములో నిప్పురవ్వలు చెలరేగి క్షణాల్లో అన్ని ప్రాంతాలకు మంటలు వ్యాపించాయి. ఒక్కసారిగా విద్యుత్ తీగలు, కేబుళ్లకు నిప్పంటుకోవడంతో నలువైపులా నల్లటి పొగలు వ్యాపించాయి. ఈ మంటలకు గోదాము పైకప్పులు పగిలి ముక్కచెక్కలయ్యాయి. ఈ ప్రమాదం గురించి సమాచారం అందగానే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది ఐసీఎఫ్, సెంబియం, కొళత్తూరు, విల్లివాక్కం నుంచి ఫైరింజన్లను రప్పించి, సుమారు నాలుగు గంటలసేపు పోరాడి మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఆ మంటల్లో కోట్లు విలువచేసే వస్తువులు కాలిబూడిదయ్యాయి. ఆ గోదాములో ప్రతి రోజూ ఉదయం 10 గంటలకు ఉద్యోగులు, కార్మికులు డ్యూటీకి హాజరవుతున్నారు. ఈ అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఉద్యోగులెవ్వరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. మంటల కారణంగా ఆ గోడౌన్ గోడలన్నీ బీటలువారాయి. దీంతో ఎక్సకవేటర్లు తెప్పించి గోడలను కూల్చివేయించారు. ఈ ప్రమాదంపై రైల్వే పోలీసులు విచారణ జరుపుతున్నారు.



బుగ్గిపాలైన వస్తువులు

---

# మాజీ మంత్రి అనుచరుడి ఇంట్లో సీబీసీఐడీ సోదాలు



కవిన్ ఇంటి వద్ద సీబీసీఐడీ అధికారులు

అడయార్, జూలై 11: కరూర్ జిల్లా వాంగల్ కుప్పిచ్చిపాళయం ప్రాంతానికి చెందిన ప్రకాష్‌కు సంబంధించిన రూ.100 కోట్ల విలువ చేసే భూమిని నకిలీ పత్రాలు సృష్టించి ఆక్రమించుకున్నారన్న ఆరోపణలతో అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి ఎంఆర్ విజయభాస్కర్ అనుచరుడి ఇంటిలో సీబీసీఐడీ గురువారం ఆకస్మిక తనిఖీలు చేసింది.. గత నెల 14వ తేదీన బాధితుడు ఫిర్యాదు చేయగా, ఇదే అంశంపై సబ్ రిజిస్ట్రార్ కూడా మరో ఫిర్యాదు ఇచ్చారు. ఇందులో సబ్ రిజిస్ట్రార్ ఫిర్యాదు ప్రకారం పోలీసులు... యువరాజ్, ప్రవీణ్, రఘు, సిద్ధార్థన్, మారప్పన్, సెల్వరాజ్, స్థల యజమాని ప్రకాష్ కుమార్తె శోభనలపై మొత్తం ఎనిమిది సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అదేవిధంగా స్థల యజమాని ప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. మాజీ మంత్రి ఎంఆర్ విజయభాస్కర్, ఆయన సోదరుడు శేఖర్, ప్రవీణ్ సహా ఆరుగురిపై కేసు నమోదు చేశారు. ఇదిలావుంటే, ఈ కేసు విచారణను గత నెల 14వ తేదీన ప్రభుత్వం సీబీసీఐడీకి బదిలీ చేసింది. దీంతో ఎంఆర్ విజయభాస్కర్ నెల రోజులుగా అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. ఆయన ఆచూకీ కోసం ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.. ఈ నేపథ్యంలో ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ గత 12న ఆయన కరూర్ జిల్లా చీఫ్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ వేయగా, దానిపై విచారణ జరిపిన కోర్టు అదే నెల 25వ తేదీన తోసిపుచ్చింది. ఆ తర్వాత తన తండ్రి అనారోగ్యంతో బాధపడుతున్నారని, ఆయనకు వైద్యం చేయించేందుకు వీలుగా ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ జిల్లా ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ కూడా జూలై ఒకటో తేదీన తిరస్కరణకు గురైంది. ఈ నేపథ్యంలో కరూర్‌లో ఉన్న మాజీ మంత్రి విజయభాస్కర్ ప్రధాన అనుచరుడు, అన్నాడీఎంకే ఐటీ విభాగం జిల్లా నిర్వాహకుడు కవిన్ నివాసంలో తిరుచ్చి సీబీసీఐడీ పోలీసులు గురువారం ఉదయం 7.30 గంటల నుంచి సోదాలు చేపట్టారు. ఆ సమయంలో కవిన్ కుటుంబ సభ్యులు మాత్రమే ఇంటిలో ఉన్నారు. ఈ సందర్భంగా పోలీసులు పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

---

# సమస్యల పరిష్కారానికి 'ప్రజలతో ముఖ్యమంత్రి'

● మంత్రి దురైమురుగన్

వేలూరు, జూలై 11: ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించేలా 'ప్రజలతో ముఖ్యమంత్రి' కార్యక్రమం చేపట్టినట్లు మంత్రి దురైమురుగన్ తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలు పరిష్కరించేలా చేపట్టిన ఈ పథకాన్ని గురువారం ధర్మపురిలో ముఖ్యమంత్రి స్టాలిన్ లాంఛనంగా ప్రారంభించారు. కాట్పాడి డివిజన్ సేవూరులోని ఏఎస్ గురుస్వామి కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి దురైమురుగన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రజలు సమస్యలతో కూడిన వినతిపత్రాలను ప్రభుత్వ కార్యాలయాల్లో అందజేసి వాటి పరిష్కారం కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ జాప్యాన్ని అరికట్టేందుకు ప్రజలతో ముఖ్యమంత్రి కార్యక్రమం ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు అందించే వినతిపత్రాలు ఆరోజు సాయంత్రం 5 గంటల్లోపు, ఏడు రోజులు, 30 రోజుల్లోపు అని మూడు విభాగాలుగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి, వేలూరు ఎంపీ కదిర్ ఆనంద్, ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్, అమ్ములు విజయన్, జిల్లా పంచాయతి కమిటీ అధ్యక్షుడు బాబు, మేయర్ సుజాత ఆనందకుమార్, ఉప మేయర్ సునీల్‌కుమార్, యూనియన్ కమిటీ అధ్యక్షుడు వేల్‌మురుగన్, రవిచంద్రన్, సత్యానందం, అముద జ్ఞానశేఖరన్, భాస్కరన్, చిత్రా జనార్ధనన్, జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, గ్రామీణాభివృద్ధి పథక డైరెక్టర్ ఆర్తి, మహిళా పథక డైరెక్టర్ నాగరాజన్, పలు శాఖల అధికారులు, డీఎంకే నాయకులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దురైమురుగన్, కలెక్టర్ సుబ్బులక్ష్మి తదితరులు

## సమాచార ధ్వని

### 28న 'చాటు పద్యము - హాస్యము'

చెన్నై, జూలై 11 (ఆంధ్రజ్యోతి): 'వేద విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో నెలనెలా 'తరతరాల తెలుగు కవిత' ఉపన్యాస ధారావాహిక కార్యక్రమం ఈ నెల 28న జరుగనుంది. టి.నగర్ విజయరాఘవరోడ్డులో వున్న ఆంధ్రా క్లబ్‌లో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు 'చాటు పద్యము - హాస్యము' అనే అంశంపై గుంటూరు హిందూ కళాశాల అధ్యాపకులు డాక్టర్ నందనవనం శ్రీనివాసరావు ఉపన్యసించనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని సంస్థ అధ్యక్షులు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

### ఫిజియోథెరపిస్ట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూలై 11: రాష్ట్ర క్రీడాభివృద్ధి కమిషన్‌లో ఖాళీగా ఉన్న స్పోర్ట్స్ ఫిజియోథెరపిస్ట్ పోస్టులకు అర్హులైన వారు ఈ నెల 29వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ కార్యదర్శి మేఘనాథ రెడ్డి తెలిపారు. పీజీ ఫిజియోథెరపి, స్పోర్ట్స్ ఫిజియోథెరపి కోర్సులు పూర్తిచేసి 21 ఏళ్ల పైబడిన వారు www.sdat.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తిచేసి స్థానిక నెహ్రూ స్టేడియంలోని కమిషన్ కార్యాలయానికి పంపించాలి.

### 15న అప్రెంటిస్ శిక్షణ

ఐసిఎఫ్, జూలై 11: జిల్లాస్థాయి అప్రెంటిస్ శిక్షణా శిబిరం ఈ నెల 15వ తేది ఉత్తర చెన్నై ఆర్కే నగర్ ఐటీఐలో ఉదయం 9 గంటలకు జరుగనుంది. ఇందులో పాల్గొనే ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు అప్రెంటీస్‌లను ఎంపిక చేయనున్నాయి. ఐటీఐ ఉత్తీర్ణులైన వారు ఈ శిబిరంలో పాల్గొనవచ్చు. ఇతర వివరాలకు www.apprenticeshipindia.gov.in అనే వెబ్‌సైట్ చూడొచ్చు.

### కేంద్రప్రభుత్వ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూలై 11: కేంద్రప్రభుత్వ వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 8,326 ఎంటీఎస్, హవల్దార్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఔత్సాహికులు ఈ నెల 31వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంటీఎస్) నాన్ టెక్నికల్ పోస్టులకు టెన్త్ ఉత్తీర్ణులై 18 నుంచి 25 ఏళ్లలోపున్న వారు, హవల్దార్ పోస్టులకు అదే విద్యార్హత, వయస్సు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులకు రాతపరీక్ష రెండు పేపర్లుగా నిర్వహిస్తారు. అక్టోబరు, నవంబరులో జరుగనున్న ఈ పరీక్షల తేది త్వరలో వెల్లడించనున్నారు. దరఖాస్తు రుసుము రూ.100గా చెల్లించాలి. మహిళలు, ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగులు, మాజీ సైనికులు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. ఇతర వివరాలకు www.ssc.gov.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

### పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరండి

ఐసిఎఫ్,జూలై11:పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ముగిసిన నేపథ్యంలో, 50శాతం సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆయా కళాశాలకు వెళ్లి అడ్మిషన్లు పొందవచ్చని సాంకేతిక విద్య డైరెక్టర్ వీరరాఘవరావు తెలిపారు. రాష్ట్రంలో 496 ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో 1.40 లక్షల సీట్లున్నాయి. ఈ విద్యా సంవత్సరం అడ్మిషన్లకు సంబంధించిన నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 50 శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని విద్యార్థులు కళాశాలలకు వెళ్లి అడ్మిషన్లు పొందాలని డైరెక్టర్ వీరరాఘవరావు తెలిపారు.

### ప్రతిభా కేంద్రాలుగా పాలిటెక్నిక్ కళాశాలలు

ఐసిఎఫ్, జూలై 11: రాష్ట్రంలోని 44 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను రూ.2,360 కోట్లతో ప్రతిభా కేంద్రాలుగా మార్చనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కళాశాలల హోదా పెంచేందుకు సాంకేతిక విద్య డైరెక్టరేట్ చర్యలు చేపట్టింది. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ... ఇంజనీరింగ్ విద్యార్థులకన్నా పాలిటెక్నిక్ విద్యార్థులు 75 శాతం మంది ఉద్యోగ అవకాశాలు పొందినట్లు తెలిపారు. 2020-21లో పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరి 2022-23లో చదువు పూర్తిచేసుకున్న 62,410 మందిలో 54,888 మంది విద్యార్థులు నెలకు రూ.16,000 వేతనంతో ఉద్యోగాల్లో చేరారని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించి పాఠ్యాంశాల్లో మార్పులు చేపట్టామన్నారు. ఈ కళాశాలలు అభివృద్ధి కోసం ప్రభుత్వం కేటాయించిన నిధులతో ప్రతిభా కేంద్రాలుగా మార్చనున్నామని పేర్కొన్నారు.

### నేడు సహకార సంఘ ఉద్యోగుల గ్రీవెన్స్

ఐసిఎఫ్, జూలై 11: చెన్నై మండలంలోని సహకార సంఘాల ఉద్యోగులకు శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు సహకార శాఖ రిజిస్ట్రార్ మృణాళిని తెలిపారు. సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేలా ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్థానిక బ్రాడ్‌వే ప్రకాశం రోడ్డులో ఉన్న సహకార కార్యాలయంలో నిర్వహించే శిబిరంలో ఉద్యోగులు పాల్గొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని రిజిస్ట్రార్ మృణాళిని తెలిపారు.

### నేడు విద్యుత్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, జూలై 11: స్థానిక టి.నగర్, వ్యాసర్పాడి ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ గ్రీవెన్స్ ఆయా ప్రాంత పరిధికి చెందిన ఉప విద్యుత్ కేంద్ర ప్రాంగణాల్లో వినియోగదారులు పాల్గొని, తమ సమస్యలకు పరిష్కారం పొందాలని విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.

### నేడు, రేపు 945 ప్రత్యేక బస్సులు

ఐసిఎఫ్, జూలై 11: వారాంతపు రోజులైన శుక్ర, శని వారాల్లో రద్దీ నియంత్రణకు 945 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రవాణా శాఖ అధికారులు తెలిపారు. శుక్ర, శనివారాల్లో నగరం నుంచి ఇతర ప్రాంతాలకు, అక్కడి నుంచి నగరానికి ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను ప్రభుత్వ రవాణా సంస్థలు నడుపుతున్నాయి. ఆ ప్రకారం, కిలంబాక్కం నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి సహా వివిధ ప్రాంతాలకు శుక్రవారం 265 బస్సులు, శనివారం 325 బస్సులు, కోయంబేడు నుంచి పలు ప్రాంతాలకు శుక్ర, శనివారాల్లో తలా 65 బస్సులు, బెంగుళూరు, ఈరోడ్, కోవై వంటి ప్రాంతాల నుంచి ఇతర ప్రాంతాలకు 200 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. కోయంబేడు బస్టాండ్ నుంచి తిరువణ్ణామలైకు రెండు రోజులు తలా 15 అని మొత్తం 945 బస్సులు నడుపనున్నట్లు అధికారులు తెలిపారు.

### 15న ఐటీఐలో చేరేందుకు ప్రత్యేక శిబిరం

ఐసిఎఫ్, జూలై 11: టెన్త్, ప్లస్ టూ ఫెయిలైన విద్యార్థులు ఐటీఐలో చేరేందుకు ఈ నెల 15వ తేది ప్రత్యేక శిబిరం ఏర్పాటుచేసినట్లు ఎస్టీ సంక్షేమ శాఖ డైరెక్టర్ అన్నాదురై తెలిపారు. 'నాన్ ముదల్వన్' పథకం ప్రకారం ఎస్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో టెన్త్, ప్లస్‌టూ పబ్లిక్‌పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులను గుర్తించి వారికి వృత్తి శిక్షణ ఇచ్చేందుకు అధికారులు నిర్ణయించారు.ఆప్రకారం, తిరువణ్ణామలై, కళ్లకుర్చి, సేలం, నామక్కల్, కోయంబత్తూర్, నీలగిరి జిల్లాల్లో ఉన్న ప్రభుత్వ ఐటీఐలలో విద్యార్థుల అడ్మిషన్లకు ప్రత్యేక శిబిరాన్ని ఈ నెల 15వ తేది నిర్వహించనున్నారు.

## వైద్యవిద్యలో 50 శాతం రిజర్వేషన్ల తొలగించే కుట్ర

● పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి ఆరోపణ

చెన్నై, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సుల అడ్మిషన్లలో ప్రభుత్వ వైద్యులకు 50 శాతం సీట్ల రిజర్వేషన్లను ఈ ఏడాది 15 రకాల కోర్సులకు రద్దు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి తీవ్రంగా తప్పుబట్టారు. ఈ మేరకు ఆయన గురువారం ప్రకటన విడుదల చేశారు. కష్టపడి సాధించుకున్న ప్రభుత్వ వైద్యుల సీట్ల రిజర్వేషన్లపై డీఎంకే ప్రభుత్వం గుట్టుచప్పుడు లేకుండా నిర్ణయం తీసుకోవడానికి కుట్ర పన్నుతోందనే అనుమానం వ్యక్తం చేశారు. తమిళనాడులోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల అడ్మిషన్లలో ప్రభుత్వ వైద్యులకు 50 శాతం రిజర్వేషన్ కల్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అయితే 2024-25 ఏడాదికి గాను మెడికల్ పీజీ కోర్సుల అడ్మిషన్లు, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పీడియాట్రిక్స్, ప్రసూతి శాస్త్రం, ఆర్థోపెడిక్స్, అనస్థీషియాలజీ, కార్డియాలజీ, ఇంటర్వెన్షనల్ మెడిసిన్, సోషల్ మెడిసిన్, ఫోరెన్సిక్ మెడిసిన్ మినహా మిగిలిన 15 కోర్సుల్లో ప్రభుత్వ వైద్యులకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేయబడదని, మున్ముందు డిమాండ్ మేరకు సీట్ల కేటాయింపుపై నిర్ణయం తీసుకోబడుతుందని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అకారణంగా తీసుకున్న ఈ నిర్ణయం సామాజిక న్యాయానికి విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని అన్బుమణి డిమాండ్ చేశారు.

## పేదలకు సహాయాల పంపిణీ



సహాయాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ సునీల్

చెన్నై, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం ఆ పార్టీ రాష్ట్ర యువజన విభాగ సంయుక్త కార్యదర్శి డాక్టర్ సునీల్ భారీ స్థాయిలో సహాయాలు పంపిణీ చేశారు. టి.నగర్ పాండీబజారు సమీపంలో సుమారు 700 మందికి వివిధ రకాల సహాయాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నాడీఎంకే నేతలు కె.సూర్యకళ, పి.పద్మనాభన్, కె.తన్మోళి, ఎస్.సురేష్‌కుమార్, వి.సురేష్‌కుమార్, సి.ప్రభాకరన్, కరాటే ఎస్.శేఖర్, ఎస్.జయరామన్, ఎస్‌ఎంఎస్ జాకీర్ హుస్సేన్, రాయల్ వెంకటేష్, సంతాన లక్ష్మి, మల్లికా మణి, కె.కస్తూరి, కె.వరలక్ష్మి తదితరులు కూడా పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, జూలై 11: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

**అరుంబాక్కం:** నెర్కుంద్రం, పల్లవన్ నగర్, ఎల్టీ పటేల్ రోడ్డు, శాంతా అవెన్యూ, రెడ్డి వీధి, సీటీఎన్ నగర్, శక్తి నగర్, అంబికా నగర్, శివంది అవెన్యూ, పూందమల్లి హైరోడ్డు

**పోరూర్:** కొలుమణివాక్కం, నెల్లితోపు, మహాలక్ష్మి నగర్, తిరుపతి నగర్, మారుతి నగర్, జనని నగర్, గురు అవెన్యూ, శ్రీనివాస నగర్, మాసిలామణి నగర్, మేల్మా నగర్, మల్లికా నగర్, ఛార్లెస్ నగర్, శబరి నగర్, కొలుమణివాక్కం ఏరియా, రాజీవ్ నగర్, అమ్మన్ నగర్, లక్ష్మి నగర్, కుంద్రత్తూర్ మెయిన్ రోడ్డు, కేకే నగర్, అన్నా వీధి, గోవిందరాజ్ నగర్, అలెక్స్ నగర్, ఎన్ఎస్కే అవెన్యూ, ముత్తుకుమరన్ కళాశాల, కావనూరు, శివగలత్తూర్, కెలిత్‌పేట, నందంబాక్కం, పెరియార్ నగర్, అంజుగం నగర్, మలయపాక్కం, మెహతా నగర్, మానాచేరి, జీఎస్ ఏరియా, మాంగాడు, అయ్యనార్‌పేట, భరణిపుత్తూర్, చిన్నపంజేరి, కక్కిలిపేట, లీలావతి నగర్, ఈవీపీ అవెన్యూ, మానచ్చేరి, కుమరన్ నగర్, అక్షయ అపార్ట్‌మెంట్, మురుగన్ ఆలయ మెయిన్ రోడ్డు, మేలాండై వీధి, నందీశ్వర ఆలయ వీధి, టెంపుల్ టౌన్, బాలవరాయన్ నగర్, ట్యాంక్ బండ్ వీధి, బాబూ నగర్, జగన్నాథపురం.

## 8మంది 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

● 11 దుంగల స్వాధీనం



పట్టుబడ్డ స్మగ్లర్లు

మంగళం, జూలై 11: అన్నమయ్య జిల్లా రాజంపేట అటవీ ప్రాంతంలో ఎనిమిది మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 11 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐలు సురేష్‌బాబు, వినోద్‌కుమార్‌రెడ్డి బృందం రాయవరం సెక్షన్ నల్లగట్టు ప్రాంతంలో బుధవారం కూంబింగ్ చేస్తుండగా, అక్కడ కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకొస్తూ కనిపించారు. చుట్టుముట్టగా దుంగలను పడేసి పారిపోయారు. వెంబడించి ఎనిమిది మంది స్మగ్లర్లను పట్టుకున్నారు. వీరిని తమిళనాడు తిరపత్తూరు జిల్లా అంబూరు తాలుకాకు చెందిన చక్రవర్తి గోవిందన్(40), హరికృష్ణన్ శ్రీనివాసన్(49), గోవిందరాజు మురుగన్(23), శక్తివేలు(27), తిరుపతి సెల్వం (24), సెల్వం చిన్నకుజహండ(50), సురేష్(23), అనంతపురం జిల్లా కన్నపల్లికి చెందిన వడ్డే సుబ్రహ్మణ్యం(45)గా గుర్తించారు. వీరి వద్ద నుంచి 11 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, పరారైన వారి కోసం గాలిస్తున్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీనివాసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు రిజిస్ట్రేషన్లకు అదనపు టోకెన్లు

పెరంబూర్, జూలై 11: ఆణిమాసం చివరి ముహూర్తపు రోజైన శుక్రవారం రిజిస్ట్రేషన్లకు అదనపు టోకెన్లు అందజేయనున్నారు. ఈ మేరకు రిజిస్ట్రేషన్ శాఖ విడుదల చేసిన ప్రకటనలో ఒక సబ్ రిజిస్ట్రార్ ఉండే కార్యాలయాల్లో ప్రతిరోజు ఇచ్చే వంద టోకెన్లకు బదులు 150, ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లుండే కార్యాలయాల్లో 200 నుంచి 300లు టోకెన్లు అందజేయనున్నట్లు ప్రకటించింది.

## రన్‌వే పక్కనే గుడ్లు పెట్టిన పక్షి



రన్‌వే పక్కన గుడ్లపై కూర్చున్న రెడ్ లాంప్‌వింగ్

పెరంబూర్, జూలై 11: స్థానిక మీనంబాక్కం సమీపంలోని విమానాశ్రయ రన్‌వే పక్కనే ఓ పక్షి గుడ్లు పెట్టి పొదుగుతుండడం గమనించి ఉద్యోగులు దిగ్భ్రాంతి చెందారు. విమానాశ్రయ సమీపంలోని అడయార్ నది తీరం వెంబడి ఉన్న గడ్డి భూములు, తేమతో కూడిన ప్రాంతాల్లో పలురకాల పక్షులున్నాయి. ఈ పక్షులు విమానాశ్రయ రన్‌వే, పరిసర ప్రాంతాల్లో గుంపులుగా ఎగురుతుండడం, రన్‌వే పక్కనే ఉంటున్నాయి. దీంతో, విమానాల రాకపోకల సమయాల్లో ఉద్యోగులు టపాసులు కాల్చి పక్షులను తరిమేస్తుంటారు. ఈ నేపథ్యంలో, కొద్ది రోజుల క్రితం రన్‌వే సమీపంలో ఓ పక్షి అక్కడే కూర్చొని ఉండడం ఉద్యోగి గమనించాడు. దగ్గరకు వెళ్లి చూడగా, ఆ పక్షి రెండు గుడ్లపై కూర్చొని పొదుగుతుండడాన్ని గమనించి ఆశ్చర్యపోయాడు. ఆ దృశ్యాలను సదరు ఉద్యోగి తన సెల్‌ఫోన్‌లో బంధించాడు. ఆ పక్షి రెడ్ లాంప్‌వింగ్ రకానికి చెందినదని, తక్కువ ఎత్తులో మాత్రమే ఎగురుతుందని తెలిసింది. అలాగే, ఎత్తైన స్థలం, చెట్లు, పంట పొలాలు తదితరాల్లో గూళ్లు కట్టుకొని గుడ్లు పెట్టి సంతానోత్పత్తి చేసుకుంటుందని పక్షి ప్రేమికులు తెలిపారు. కాగా, రన్‌వే పక్కనే పక్షి గుడ్లు పెట్టి పొదిగే దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## చేతుల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన



శుభ్రం చేసుకున్న చేతులు చూపుతున్న విద్యార్థులు

పెరంబూర్, జూలై 11: స్థానిక మైలాపూర్‌లోని కార్పొరేషన్ పాఠశాలలో గురువారం చేతులు శుభ్రం చేసుకొనే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్షాకాలం ప్రారంభమయ్యే నేపథ్యంలో, అంటువ్యాధులు వ్యాప్తి కూడా పెరుగుతోంది. ఈ వ్యాధులను నియంత్రించేలా గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇల్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా మైలాపూర్ కార్పొరేషన్ పాఠశాల విద్యార్థులకు చేతులు శుభ్రంగా ఉంచుకోవడంపై అవగాహన కల్పించారు. చేతులు శుభ్రం చేసుకొనే విధానాన్ని విద్యార్థులచేత అధికారులు ప్రతిజ్ఞ చేయించారు.

తాంబరం స్టేషన్‌లో నగదు స్వాధీనం వ్యవహారం...

## సీబీసీఐడీ ఎదుట హాజరైన బీజేపీ రాష్ట్ర కోశాధికారి

అడయార్, జూలై 11: లోక్‌సభ ఎన్నికల సమయంలో తాంబరం రైల్వే స్టేషన్‌లో రూ.4 కోట్లను స్వాధీనం చేసుకున్న కేసులో బీజేపీ రాష్ట్ర కోశాధికారి ఎస్ఆర్ శేఖర్ గురువారం సీబీసీఐడీ ప్రధాన కార్యాలయంలో హాజరయ్యారు. ఎగ్మోర్‌లోని సీబీసీఐడీ ప్రధాన కార్యాలయానికి తన న్యాయవాదులను వెంటబెట్టుకుని వచ్చిన ఆయన వద్ద సీబీసీఐడీ అధికారులు వివిధ కోణాల్లో ప్రశ్నించారు. ముఖ్యంగా ఈ రైల్వే స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న నగదుకు సంబంధం ఏంటి? ఇలా అనేక కోణాల్లో ప్రశ్నల వర్షం కురిపించారు. ఉదయం 10.30 గంటల నుంచి ఈ విచారణ కొనసాగింది. కాగా, ఈ కేసు విచారణకు దుమ్మా కొట్టేందుకు ఎస్ఆర్ శేఖర్ చేసిన న్యాయపోరాటం ఏమాత్రం ఫలించకపోలేదు. పైగా ఈ కేసులో సీబీసీఐడీ అధికారులు పదేపదే నోటీసులు జారీ చేయడంతో మరో మార్గం లేక ఆయన సీబీసీఐడీ అధికారుల ఎదుట హాజరయ్యారు.

## ఖైదీ నుంచి మొబైల్ ఫోన్ స్వాధీనం

అడయార్, జూలై 11: స్థానిక పూందమల్లిలోని ప్రత్యేక జైలులో ఒక విచారణ ఖైదీ నుంచి మొబైల్ ఫోన్‌తో పాటు సిమ్ కార్డును జైలు సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. పూందమల్లిలోని కరైయాన్ చావడిలో ఈ ప్రత్యేక జైలు ఉంది. ఇక్కడ వివిధ నేరాలకు పాల్పడిన విచారణ ఖైదీలను బంధించివుంటారు. ఈక్రమంలో గురువారం ఉదయం జైలు సూపరింటెండెంట్ జేమ్స్ నేతృత్వంలో ప్రత్యేక బృందం జైలు గదుల్లో క్షుణ్ణంగా తనిఖీ చేసింది. ఈ తనిఖీల్లో గంజాయి కేసులో అరెస్టు చేసి జైలులో ఉన్న ఓ ఖైదీ గదిలో సెల్ ఫోన్, రెండు బ్యాటరీలు, ఒక సిమ్ కార్డును స్వాధీనం చేసుకున్నారు. ఈ మొబైల్ ఫోన్, సిమ్ కార్డు ఎలా వచ్చిందన్న అంశంపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ఇంజనీరింగ్ సెమిస్టర్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం....

## ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ పరీక్ష వాయిదా

పెరంబూర్, జూలై 11: ఇంజనీరింగ్ సెమిస్టర్ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ అయిన వ్యవహారం చర్చకు దారితీసిన నేపథ్యంలో, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ పరీక్ష వాయిదావేసినట్లు అన్నా విశ్వవిద్యాలయం ప్రకటించింది. అన్నా వర్సిటీ పరిధిలోని కళాశాలల్లో ఇంజనీరింగ్ కోర్సులకు సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. ఇంజనీరింగ్ రెండో సంవత్సరం విద్యార్థులకు బుధవారం ఎన్విరాన్‌మెంట్ సైన్స్, సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ పాఠ్యాంశాల్లో సెమిస్టర్ పరీక్ష జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో, ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో ఈ పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రం లీకైనట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. దీంతో, ఈ పరీక్షలను ఈ నెల 31వ తేదీకి వాయిదావేస్తున్నట్లు అన్నావర్సిటీ ప్రకటించింది. ఈ మేరకు వర్సిటీ పరీక్షల నియంత్రణ విభాగాధికారి పి.శక్తివేలు కళాశాలలకు పంపిన ఉత్తర్వులో... బుధవారం జరగాల్సిన ఎన్విరాన్‌మెంట్ సైన్స్, సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ పరీక్షలు ఈ నెల 31వ తేదీకి వాయిదావేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రశ్నాపత్రాల బండిళ్లు తెరవకుండా అలాగే వర్సిటీకి పంపించాలని ఉత్తర్వుల్లో సూచించారు. కాగా, పరీక్ష ఎందుకు వాయిదావేశారో మాత్రం సర్క్యులర్‌లో పేర్కొనకపోవడం గమనార్హం.

అన్నా వర్సిటీ రిజిస్ట్రార్‌కు పీడీ వారెంట్...

కోర్టు ధిక్కరణ కేసులో అన్నా యూనివర్సిటీ రిజిస్ట్రార్ జె.ప్రకాష్‌కు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. మాజీ ప్రొఫెసర్ మనోహరన్ వేసిన కోర్టు ధిక్కరణ కేసులో వర్సిటీ రిజిస్ట్రార్‌కు మద్రాసు హైకోర్టు పీడీ వారెంట్ జారీచేసింది.

## సాట్టై దురైమురుగన్ అరెస్టు

చెన్నై, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లా కుత్రాలం వద్ద గెస్ట్ హౌస్‌లో ఉన్న నామ్‌తమిళర్ కట్చి నేత, సాట్టై దురైమురుగన్‌ను తిరుచ్చి పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఇటీవల విక్రవాండి ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న దురై మురుగన్ మాజీ సీఎం కరుణానిధి, ప్రస్తుత ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కించపరిచే విధంగా విమర్శలు చేయడంతో పోలీసులు అతడిని అరెస్టు చేశారు.

# 'ఇండియా ఫుడ్ సర్వీసెస్ రిపోర్ట్' ఆవిష్కరణ

చెన్నై, జూలై 11 (ఆంధ్రజ్యోతి): 'ది నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' (ఎన్ఆర్ఏఐ) చెన్నై విభాగం ఆధ్వర్యంలో 'ఇండియా ఫుడ్ సర్వీసెస్ రిపోర్ట్-2024' ఆవిష్కృతమైంది. గురువారం చెన్నైలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎన్ఆర్ఏఐ అధిపతి గంధర్వ్ ధింగ్రా, చెన్నై విభాగ సహ వ్యవస్థాపకులు ఆర్.బాలచందర్, కో-చాప్టర్ హెడ్ శ్రీరాం రాజేంద్రన్, కార్యదర్శి ప్రసన్న గణేశన్ తదితరులు లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఫుడ్ సర్వీసెస్ రంగం విలువ రూ.5,69,487 కోట్లుండగా, ఇది 2028 నాటికి రూ.7,76,511 కోట్లకు చేరుకుంటుందని ఎన్ఆర్ఏఐ అంచనా వేసింది.



నివేదిక ఆవిష్కరణలో ఎన్ఆర్ఏఐ ప్రతినిధులు

## మళ్లీ 13 మంది రాష్ట్ర జాలర్ల అరెస్ట్

పెరంబూర్, జూలై 11: కచ్చాదీవి సమీపంలో సరిహద్దులు దాటారంటూ 13 మంది రాష్ట్ర జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసింది. పుదుకోట జిల్లాకు చెందిన జాలర్లు బుధవారం చేపలు పట్టేందుకు సముద్రంలోకి వెళ్లారు. కచ్చాదీవి సమీపంలో గురువారం తెల్లవారుజామున చేపల వేటలో ఉన్న జాలర్లను శ్రీలంక నావికాదళం చుట్టుముట్టింది. సరిహద్దులు దాటి చేపలు పడుతున్నారని మూడు పడవలు సహా 13 మంది జాలర్లను అరెస్ట్ చేసి కాంగేశన్ హార్బర్‌లోని కోస్ట్‌గార్డ్ శిబిరానికి తీసుకెళ్లి విచారిస్తున్నారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన జాలర్ల సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు, శ్రీలంక జైళ్లలోని రాష్ట్ర జాలర్లు, వారి పడవలు విడిపించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాగా శ్రీలంక నావికాదళం అరెస్టు చేసిన జాలర్లను విడిపించేలా చర్యలు తీసుకోవాలని సీఎం స్టాలిన్ కేంద్రానికి లేఖ రాసారు.

## లంచం తీసుకున్న వీఏవో అరెస్ట్

పెరంబూర్, జూలై 11: సేలం సమీపంలో పట్టాలో పేరు మార్పు కోసం రూ.15వేలు లంచం తీసుకున్న తుంబల్‌పట్టి మహిళా గ్రామ నిర్వహణాధికారి బాలాంబికను అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్ట్ చేశారు. అరవింద్, అజిత్‌కుమార్ తమ పట్టాలో పేర్లు మార్పిండికోసం బాలింబికను సంప్రదించగా, ఆమె రూ.20 వేలు డిమాండ్ చేశారు. రూ.15 వేలకు ఒప్పందం కుదుర్చుకుని ఏసీడీ అధికారులను వారు ఆశ్రయించారు. వారి సూచనతో బాలాంబికకు వారు నగదు అందిస్తుండగా, అక్కడే మాటువేసిన అధికారులు వీఏవోను పట్టుకొని అరెస్ట్ చేసి, ఆమె బ్యాగు నుంచి రూ.33,000 స్వాధీనం చేసుకున్నారు.

## విద్యార్థినులతో అసభ్య ప్రవర్తన

● ఇద్దరు టీచర్ల సస్పెన్షన్

పెరంబూర్, జూలై 11: తిరువళ్లూర్ జిల్లా సెవ్వాపేటలోని ప్రభుత్వ ఆదిద్రావిడర్ మహిళా మహోన్నత పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయులు జగదీశన్, ప్రేమ్‌కుమార్‌పై సస్పెన్షన్ వేటుపడింది. బాధిత విద్యార్థుల ఫిర్యాదు నేపథ్యంలో, కొద్దిరోజుల క్రితం ఆదిద్రావిడుల సంక్షేమ శాఖ మంత్రి కయల్‌విళి సెల్వరాజ్ స్వయంగా పాఠశాలకు వెళ్లి విచారించారు. ఈ నేపథ్యంలో, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ జిల్లా ప్రధాన విద్యాధికారి ఉత్తర్వులు జారీచేశారు.

## మద్యానికి బానిసవుతున్న విద్యార్థులు

● మదురై ఆధీనం ఆవేదన

పెరంబూర్, జూలై 11: విద్యార్థులు మద్యానికి బానిసలవుతున్నారని మదురై ఆధీనం ఆవేదన వ్యక్తంచేశారు. తూత్తుకుడి జిల్లా ఆనందవిలై గ్రామంలో ఉన్న ముత్తారమ్మన్ ఆలయ కుంభాభిషేక వేడుకల్లో పాల్గొన్న ఆధీనం జ్ఞానసంబంధ దేశికర్ మాట్లాడుతూ... రాష్ట్రంలో విద్యార్థులు పాస్ మార్కుల దిశగా వెళుతున్నారో, లేదో తెలియడం లేదని, టాస్మాక్ మద్యం దుకాణాల వైపు మాత్రం వెళ్తున్నారన్నారు. టాస్మాక్ దుకాణాలు మూసివేయడమే ఈ సమస్యకు పరిష్కారమని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

## పిల్లలకు విషమిచ్చి తండ్రి ఆత్మహత్య

పెరంబూర్, జూలై 11: తిరునల్వేలి జిల్లా పనకుడిలో ఓ తండ్రి, కుమారుడు, కుమార్తె విషం తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విషాదం నింపింది. పనకుడి గ్రామానికి చెందిన రమేష్ (41)ఉమ (37) దంపతులకు రాజన్ ఎబినేజర్ (14) అనే కుమారుడు, కావ్య (10) అనే కుమార్తె ఉన్నారు. ఈ నేపథ్యంలో, భర్త మాటలు లెక్కచేయని ఉమ పది రోజుల క్రితం ఒమన్ దేశంలో ఉద్యోగానికి వెళ్లిపోయింది. అక్కడి నుంచి భర్తకు ఫోన్ చేసిన ఉమ, పిల్లలను తిరుచ్చిలో ఉంటున్న తల్లిదండ్రుల వద్ద అప్పగించాలని కోరడంతో, భార్యాభర్తల మధ్య వాగ్వివాదం జరిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో, బుధవారం ఉదయం రమేష్ ఇంటి తలుపులు తెరచుకోకపోవడంతో అనుమానించిన చుట్టుపక్కల వారు పనకుడి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకొని తలుపులు బద్దలుకొట్టి లోనికి వెళ్లి చూడగా, రమేష్, కుమారుడు, కుమార్తె విషం తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. మృతదేహాలను నాగర్‌కోయిల్ ప్రభుత్వాసుపత్రికి తరలించిన పోలీసులు, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసు...

## 11 మందికి ఐదు రోజుల పోలీసు కస్టడీ

పెరంబూర్, జూలై 11: ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసులో అరెస్టయిన 11 మందిని 5 రోజులు పోలీసు కస్టడీకి అనుమతిస్తూ ఎగ్మూర్ న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ ఈ నెల 5వ తేది పెరంబూర్‌లోని ఆయన ఇంటి సమీపంలో దారుణహత్యకు గురయ్యారు. ఈ ఘటనకు సంబంధించిన పొన్నై బాలు సహా 11 మంది పోలీస్ స్టేషన్‌లో లొంగిపోగా వారిని పూందమల్లి జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో, ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసులో అరెస్టయిన వారిని ఏడు రోజులు కస్టడీకి తీసుకొని విచారించేందుకు అనుమతించాలని కోరుతూ పోలీసులు ఎగ్మూర్ న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. భద్రతా కారణాలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుపరిచేందుకు అనుమతించాలని పోలీసులు పిటిషన్‌లో కోరగా, న్యాయస్థానం అనుమతించింది. గురువారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్ విచారణ అనంతరం, ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో అరెస్టయిన 11 మందిని ఐదు రోజులు పోలీసు కస్టడీకి అనుమతిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది.

## ప్లాస్టిక్ గోదాములో అగ్నిప్రమాదం

ఐసిఎఫ్, జూలై 11: ఈరోడ్‌లో ప్లాస్టిక్ పైపుల గోదాములో అగ్నిప్రమాదం జరిగింది. ఈరోడ్ బస్టాండ్ సమీపంలోని శక్తి రోడ్డులో రావణన్‌కు భరణి పైప్స్ అండ్ క్యూబ్స్ హోల్‌సేల్ దుకాణముంది. ఈ దుకాణం వెనుక గోదాము ఉంది. గురువారం ఉదయం షార్ట్ సర్క్యూట్ కారణంగా గోదాములో అగ్నిప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న ఈరోడ్, భవాని, పెరుందురై, మోడకుర్చి ప్రాంతాల నుంచి 6 అగ్నిమాపక వాహనాలతో వచ్చిన సిబ్బంది మంటలు అదుపుచేశారు. ఈ ప్రమాదంలో గోదాములో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయని లక్షల్లో ఆస్తి నష్టం జరిగిందని రావణన్ ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.


## సిలిండర్ పేలి పది దుకాణాలు ధ్వంసం



మంటల్లో బూడిదైన దుకాణాలు

పెరంబూర్, జూలై 11: తిరుచ్చి జిల్లా తురైయూర్ బస్టాండ్ ఎదురుగా ఉన్న హోటల్‌లో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో 10కి పైగా దుకాణాలు ధ్వంసమయ్యాయి. అంగముత్తుకు చెందిన హోటల్‌లో గురువా రం వేకువజామున హఠాత్తుగా గ్యాస్ సిలిండర్ పేలి మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారి సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొనేలోగా మంటలు 10 దుకాణాలకు వ్యాపించి, అవి పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో మూడు ద్విచక్రవాహనాలు కూడా ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.10 లక్షలకు పైగా ఆస్తి నష్టం సంభవించిందని దుకాణాల యజమానుల ఫిర్యాదులపై కేసు నమోదుచేసిన పోలీసులు విచారణ చేపట్టారు. కాగా, వేకువజాము కావడంతో హోటల్, దుకాణాల్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పిందని పోలీసులు భావిస్తున్నారు.

## పుదుకోటలో రౌడీ ఎన్‌కౌంటర్



దురై (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, జూలై 11: తిరుచ్చి ఎంజీఆర్ నగర్‌కు చెందిన దురై అనే రౌడీని పోలీసులు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపారు. పుదుకోట వెంబన్ అటవీ ప్రాంతంలో దురై తలదాచుకున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు గురువారం ఆ ప్రాంతంలో గాలించారు. రౌడీని అదుపులోకి తీసుకొనే సమయంలో అతను పోలీసులపై కత్తితో దాడిచేసినట్లు సమాచారం. ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన కాల్పుల్లో అతను మృతిచెందాడు. కాగా, రౌడీ దురై అలియాస్ దురైస్వామిపై నాలుగు హత్యా కేసులు సహా హత్యాయత్నం, దాడి, దోపిడీ తదితరాలకు సంబంధించి 70 కేసులున్నాయని పోలీసులు తెలిపారు.

## కళ్లకుర్చి ఘటనపై సీబీఐ విచారించాలనే కేసు 18కి వాయిదా

పెరంబూర్, జూలై 11: కళ్లకుర్చి కల్తీ సారా ఘటన సీబీఐకి అప్పగించాలనే పిటిషన్ ఈ నెల 18వ తేదీకి వాయిదాపడింది. కళ్లకుర్చి కరుణాపురంలో కల్తీ సారా తాగి 68 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణ తొలుత పోలీసులు చేపట్టగా, రాష్ట్రప్రభుత్వం సీబీసీఐడీకి బదిలీ చేసింది. ఈ నేపథ్యంలో, కళ్లకుర్చి కల్తీ సారా ఘటన విచారణ సీబీఐకి అప్పగించాలని కోరుతూ అన్నాడీఎంకేకు చెందిన ఇన్బదురై, పీఎంకేకు చెందిన కె.బాలు, బీజేపీకి చెందిన ఏర్కాడు ఏ.మోహన్‌దాస్ వేర్వేరు పిటిషన్లు దాఖలుచేశారు. ఈ పిటిషన్లు విచారించిన మద్రాసు హైకోర్టు, కల్తీ సారా మరణాలకు సంబంధించి కౌంటర్ అఫిడవిట్ దాఖలుచేయాలని ప్రభుత్వానికి నోటీసులు జారీచేసి, తదుపరి విచారణ ఈ నెల 18వ తేదీకి వాయిదావేసింది.


పల్లవుల శిల్పకళను చాటే సింహస్తూపం


ఆలయ ప్రవేశద్వారం


అంతర ప్రాకారం


అర్ధమండపం


అప్పన్ శ్రీవేంకటేశ్వరపెరుమాళ్

ఆధ్యాత్మికం

ఆలయాల నగరం కాంచీపురం సమీపంలో పాలారు నది దక్షిణ తీరాన ఉన్న తిరుముక్కూడల్ గ్రామంలో భక్తులందరికీ సంపూర్ణ ఆరోగ్యాన్ని, సకల సంపదలను అనుగ్రహించే 'అప్పన్ శ్రీవేంకటేశ్వర పెరుమాళ్' ఆలయం వెయ్యేళ్లనాటి భారతీయ ప్రాచీన వైద్య విధానాలకు నిలువెత్తు సాక్ష్యంగా నేటికీ విరాజిల్లుతోంది. మాధవసేవతోపాటు మానవసేవ కూడా చేయాలని చెప్పే ఈ ఆలయాన్ని భారతీయ పురావస్తు పరిశోధనా సంస్థ కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తోంది. ముచ్చటగా మూడు నదులు వేగవతి, సెయ్యారు, పాలారు సంగమించే ప్రాంతం కనుక ఈ క్షేత్రానికి ముక్కూడల్ అనే పేరొచ్చింది. - ఆంధ్రజ్యోతి, చెన్నై

# మానవసేవతోనే మాధవ సేవ

● వెయ్యేళ్లనాటి వైద్యానికి నిలువెత్తు సాక్ష్యం ● తిరుముక్కూడల్ అప్పన్ వేంకటేశ్వరాలయం


శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి

## త్రినామధేయుడు...

ఈ ఆలయంలో స్వామివారిని ముచ్చటగా మూడు పేర్లతో పిలిచేవారు. పల్లవరాజు నిర్పతుంగ వర్మడి పాలనలో 'విష్ణుభట్టర్' అని, చోళరాజుల కాలంలో 'తిరుముక్కూడల్ ఆళ్వార్' అని, విజయనగర రాజుల కాలంలో 'తిరువేంకడముడయాన్' అని పిలిచేవారు. నేడు అప్పన్ శ్రీవేంకటేశ్వర పెరుమాళ్ అని భక్తులచేత కీర్తింపబడుతున్నారు. ఈ ఆలయాన్ని దర్శిస్తే తిరుమల శ్రీవారి ఆలయాన్ని దర్శించినంత పుణ్యఫలాలు దక్కుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

## ఆలయ వైభవం...

ఆలయం బయట నుంచి చూస్తే సాధారణంగా కనిపిస్తుంది. మొట్టిగోపురాన్ని దాటి లోపలకు వెళ్తే బ్రహ్మాండమైన గర్భాలయం, ప్రహరీ, అర్ధమండపం, ముఖమండపం ఇలా రెండు ఎత్తయిన ప్రహరీలతో ప్రాచీన శిల్పకళావైభవాన్ని చాటేలా కనువిందు చేస్తాయి. ఆలయం ముందు కంచివరదుడి మండపం, స్వర్గద్వారం, ఊంజల్ మండపం, వాహనమండపం ఇలా ఎటు చూసిన మండపాలే దర్శనమిస్తాయి. ఈ ఆలయాన్ని చోళరాజుల కాలంలో నిర్మించినట్లు చెబుతున్నప్పటికీ ఆలయంలో పల్లవరాజుల నాటి శిల్పకళను చాటే శిల్పాలు కూడా ఉన్నాయి. పల్లవరాజైన నిర్పతుంగవర్మడి కాలం నాటి శిలాశాసనం ఈ ఆలయంలో లభించడం విశేషం. ఆ శిలాశాసనాన్ని బట్టి మొదట ఈ ఆలయాన్ని పల్లవరాజులు నిర్మించారని, ఆ ఆ తర్వాతే చోళరాజులు ఆలయానికి మరమ్మతులు చేపట్టి ఉంటారని పురావస్తు పరిశోధకులు చెబుతున్నారు. అంతే గాకుండా విజయనగర రాజులు కూడా ఈ ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేపట్టారని తెలుస్తోంది. ఉత్తరదిశగా గర్భాలయం నిర్మించి ఉన్నా, బలి పీఠం, ధ్వజస్తంభం పడమటి వైపున్నాయి. వీటిని దాటుకుని లోపలకు వెళ్తే ఆలయ మహామండపంలో పల్లవుల కాలం నాటి సింహాకృతితో కూడిన స్తంభాలు కనిపిస్తాయి. ఈ సింహ స్తంభాలు మినహా తక్కిన స్తంభాలన్నీ గుండ్రంగా ఉన్నాయి. ఆ స్తంభాల్లో ఒకదానిపై అందమైన వేణుగోపాలస్వామి రూపం చెక్కబడి ఉంది. మహామండపాన్ని ఆనుకుని ఉన్న మొదటి ప్రహరీ ప్రవేశద్వారానికి ఇరువైపులా ద్వారపాలకుల విగ్రహాలున్నాయి. అవి ఆరు అడుగుల ఎత్తున్నాయి. ద్వారాపాలకులకు ఎదురుగా గరుత్మంతుడి విగ్రహం ఉంది. మొదటి ప్రాకారం ప్రదక్షిణ చేసి లోపలకు వెళ్లే అప్పన్ వెంకటేశ పెరుమాళ్ సంపూర్ణ మూర్తిగా దర్శనమిస్తారు. గర్భాలయం చుట్టూ ఉన్న ప్రహరీ, మండపంలా కనిపిస్తుండటం వల్ల దానిని 'తిరుమాళిగైబత్తి' అని పిలుస్తారు. విద్యుత్ దీపాలున్నప్పటికి చీకటిగానే కనిపిస్తుంది. సూర్యుడి కిరణాలు ప్రవేశించడానికి నాలుగు మూలల్లో పైకప్పులో ద్వారాలు నిర్మించారు. గర్భాలయం చుట్టూ మహావిష్ణువు రూపాలు చెక్కబడి ఉన్నాయి. వాటిలో దక్షిణాభిముఖంగా ఉన్న స్వామివారి తిరుమేని పరమపదనాథుడిగా దర్శనమిస్తారు. ఆగ్నేయంలో ఆళ్వార్ల విగ్రహాలున్నాయి. నారాయణుడు, హనుమంతుడు, గరుత్మంతుడి విగ్రహాలు వరుసగా ఉన్నాయి. తూర్పువైపు సన్నిధిలో అలిలమేలు మంగై తాయార్ దర్శనమిస్తారు. ఇక రెండో ప్రహరీలోని సన్నిధులు కూడా భక్తులను మైమరపిస్తాయి. నైరుతి దిశగా సుందరవల్లి తాయార్ సర్వాలంకరణశోభితురాలై దర్శనమిస్తారు. వాయవ్యదిశగా కరియమాణిక్క పెరుమాళల్ సన్నిధి ఉంది. ఈశాన్యదిశగా వీరాంజనేయుడు ప్రత్యేక సన్నిధిలో దర్శనమిస్తారు.

## 11 పడకల వైద్యాలయం...

ఈ ఆలయంలోని కొంత భాగం 15 పడకల ప్రజావైద్యాలయంగా ఉండేదని పురావస్తు పరిశోధకులు ఇక్కడి శిలాశాసనాల ఆధారంగా చెబుతున్నారు. ఈ వైద్యాలయంలో నాడి పరిశీలించి మందులిచ్చే వైద్యుడు, శస్త్రచికిత్స చేసే వైద్యుడు, మందులు, నీరు తీసుకువచ్చే సహాయకుడు (కంపౌండర్), మహిళా సహాయకులు (నర్సులు) గురించి ప్రస్తావనలు శిలా శాసనాల్లో ఉన్నాయి. అంతే కాదు వెయ్యేళ్ల క్రితం వాడిన మందుల పేర్లు, అవి చెడిపోకుండా భద్రపరిచే విధానాలు గురించి తెలిసే శిలాశాసనాలున్నాయి. ఈ ఆలయంలో రోగులు (ఇన్‌పేషంట్లు) బస చేసేందుకు గదులు కూడా ఉండేవని శిలాశాసనాధారాలు చెబుతున్నాయి. అంతే కాకుండా అప్పట్లో రోగులకు 20 రకాలు మందులిచ్చేవారని, వాటిలో ఒకటి రెండు మినహా తక్కిన మందులన్నీ నేటికీ ఆయుర్వేదం తదితర వైద్య విధానాల్లో ఉపయోగిస్తుండటం విశేషం. ఈ మందుల వివరాలు చరక సంహిత అనే ఆయుర్వేద గ్రంథంలోనూ ఉన్నాయి.

### ఎలా వెళ్లాలి?

చెన్నై నగరం నుంచి కాంచీపురానికి ప్రభుత్వ రవాణా సంస్థ బస్సులు, ప్రైవేటు బస్సులు నడుపుతున్నారు. కాంచీపురానికి రైలులో కూడా వెళ్లొచ్చు. కాంచీపురం నుంచి 20 కి.మీల దూరంలో చెంగల్పట్టు దారిలో ఉన్న తిరుముక్కూడల్ వెళ్లేందుకు సిటీ బస్సులున్నాయి. ఆటోలు టాక్సీల్లోనూ వెళ్ళవచ్చు. ఈ ఆలయాన్ని ప్రతిరోజూ ఉదయం 8.30 నుంచి11.30 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. శని, ఆదివారాల్లో ఉదయం 8.30 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు, మళ్ళీ మధ్యాహ్నం 3 నుండి రాత్రి 7 గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

# నేడు 65 ఆలయాల్లో మహాకుంభాభిషేకం



పెరంబూర్, జూలై 11: రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం 65 ఆలయాల్లో మహాకుంభాభిషేకం నిర్వహించనున్నారు. ఈ మేరకు హిందూ దేవాదాయ శాఖ విడుదల చేసిన ప్రకటనలో... ముఖ్యమంత్రిగా స్టాలిన్ బాధ్యతలు చేపట్టిన అనంతరం హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జీర్ణోద్ధరణ పనులు, మహా కుంభాభిషేకాలు, రథాలు, కొలనుల పునరుద్ధరణ, ఆక్రమణలో ఉన్న ఆలయ స్థలాలు విడిపించడం, భక్తులకు వసతుల పెంపు తదితర పనులు ముమ్మరం చేశామన్నారు. 2021 మే 7 నుంచి ఈ నెల 11వ తేది వరకు 1,856 ఆలయాలకు కుంభాభిషేకం నిర్వహించామన్నారు. అలాగే, 9,141 ఆలయాల్లో జీర్ణోద్ధరణ పనులు చేపట్టేందుకు రాష్ట్ర నిపుణుల కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. కుంభాభిషేకం నిర్వహించిన 66 ఏళ్లు, బాలాలయం చేసిన 36 ఏళ్ల దాటిన నేపథ్యంలో, పలు న్యాయపోరాటాలు అధిగమించి, రూ.1.12 కోట్లతో జీర్ణోద్ధరణ పనులు చేపట్టిన తిరువాన్మియూర్, పాంబన్ స్వాముల ఆలయం, రూ.170.11 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్ ప్రాజెక్ట్ కింద తిరువళ్లూర్ జిల్లా పెరియపాళయం భవానీ అమ్మవారి ఆలయం, రూ.1.52 కోట్లతో పనులు చేపట్టిన తిరువారూర్ జిల్లా ఆలంగుడి ఆపద్‌కాయేశ్వర్ (గురు దళం) ఆలయం, సుమారు 100 ఏళ్ల క్రితం కుంభాభిషేకం నిర్వహించిన తిరుచ్చి జిల్లా పూర్తికోవిల్ తిరుముక్తీశ్వర ఆలయం సహా 65 ఆలయాల్లో కుంభాభిషేకం జరుగనుంది. కుంభాభిషేకం జరుగనున్న ఆలయాల్లో చెట్‌పెట్ కరుకాత్తమ్మన్ ఆలయం, సేలం జిల్లా కృష్ణానగర్ సీతారామచంద్ర మూర్తి ఆలయం, తంజావూరు జిల్లా పట్టుకోట, నట్టుశాలై అమృతకటేశ్వర ఆలయం, తిరువళ్లూర్ జిల్లా పొన్నేరి యాయిరు పుష్పరథీశ్వర ఆలయం తదితరాలున్నాయని హిందూ దేవాదాయ శాఖ తెలిపింది.

# విద్యతోనే దేశాభివృద్ధి

● వీఐటీ ఛాన్సలర్ కె.విశ్వనాథన్


ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఇరైఅన్బుకు జ్ఞాపిక అందజేస్తున్న వీఐటీ వర్సిటీ ఛాన్సలర్ విశ్వనాథన్

పెరంబూర్, జూలై 11: విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని, విద్యారంగానికి అందించే నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచాలని వీఐటీ యూనివర్సిటీ ఛాన్స్‌లర్ డాక్టర్ కె.విశ్వనాథన్ విజ్ఞప్తి చేశారు. వీఐటీ చెన్నై క్యాంపస్‌లో మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు పునశ్చరణ శిక్షణ ప్రారంభం గురువారం ఉదయం ప్రారంభమైంది. వర్సిటీ డాక్టర్ ఉపాధ్యక్షులు శేఖర్ విశ్వనాథన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఛాన్సలర్ విశ్వనాథన్ మాట్లాడుతూ.. దేశ జాతీయ స్థూల ఉత్పత్తిలో విద్యారంగానికి 6 శాతం కేటాయించాల్సిన పరిస్థితుల్లో, ప్రస్తుతం 3 శాతం మాత్రమే కేటాయిస్తున్నారని, విద్యారంగానికి నిధులు పెంచేలా కేంద్రప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. విద్యార్థులు నాలుగేళ్లు కష్టపడి చదివితే వారి భవిష్యత్తు ప్రకాశవంతంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం సమాజంలో నెలకొన్న తారతమ్యాలు సరిచేయడం కష్టమేనని, కానీ విద్య ద్వారా ఆర్థిక అంతరాలు సరిచేయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తమిళనాడు ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఇరైఅన్బు మాట్లాడుతూ.. విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యం చేరుకొనేందుకు నిరంతరం శ్రమించాలన్నారు. ప్రతిభతో కూడిన విద్య అభ్యసిస్తే ఉద్యోగాలు వాటికంతట అవే మన దరికి చేరుతాయన్నారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన రాంకో సిమెంట్ సంస్థ బ్రాండ్ నిర్వాహణ విభాగం ఉపాధ్యక్షుడు, వీఐటీ మాజీ విద్యార్థి రమేష్ భరత్ విద్యార్థులు జీవితంలో విజయాలు సాధించేలా సూచనలు చేశారు. కార్యక్రమానికి వీఐటీ చెన్నై డిప్యూటీ వైస్ ఛాన్సలర్ టి.త్యాగరాజన్ ఆహ్వానం పలుకగా, ఛాన్సలర్ సలహాదారులు, ప్రొఫెసర్ ఎస్పీ త్యాగరాజన్, డిప్యూటీ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ పీకే మనోహరన్, ప్రొఫెసర్ నయిముల్లాఖాన్, ప్రొఫెసర్ రాజశేఖరన్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, ఇంజనీరింగ్ విద్యార్థులకు ఈ నెల 22 నుంచి 26వ తేది వరకు పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ తెలియజేసింది.


# సమరయోధుడు అళగుముత్తుకోన్‌కు స్టాలిన్, ఈపీఎస్ సహా నేతల నివాళి


ఎగ్మూరులోని అళగుముత్తుకోన్ విగ్రహం వద్ద నివాళుర్పిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, జూలై 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు అళగు ముత్తుకోన్ 267వ జయంతి వేడుకలు గురువారం ఉదయం ఘనంగా జరిగాయి. ఆ సందర్భంగా ఎగ్మూరు రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న అళగుముత్తుకోన్ విగ్రహానికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతోపాటు మంత్రులు పెరియకరుప్పన్, రాజకన్నప్పన్, శాసనసభ్యులు తాయగం కవి, పరంధామన్, జోసెఫ్ సామువేల్, మాజీ శాసనసభ్యులు పి.రంగనాథన్, రవిచంద్రన్, మేయర్ ఆర్ ప్రియా, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్ తదితరులు పుష్పాంజలి ఘటించారు. ఇదేవిధంగా అన్నాడీఎంకే తరఫున ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి, పార్టీ ప్రిసీడియం చైర్మన్ తమిళ్‌మగన్ హుసేన్, మాజీ మంత్రులు కేపీ మునుసామి, డి.జయకుమార్, గోకుల ఇందిరా, మూర్తి, అబ్దుల్ రహీమ్, విజయభాస్కర్ తదితరులు అళగుముత్తుకోన్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించారు. బీజేపీ నేత అన్నామలై, కాంగ్రెస్ మాజీ ఎంపీ తిరునావుక్కరసర్ తదితరులు కూడా సమరయోధుడు అళగుముత్తుకోన్‌కు నివాళులర్పించారు.


స్వాతంత్ర్యసమర యోధుడు వీరన్ అళగు ముత్తుకోన్ 267వ జయంతిని పురస్కరించుకుని గురువారం చెన్నై ఎగ్మోర్‌లో వున్న ఆయన విగ్రహానికి నివాళులర్పిస్తున్న ద్రావిడదేశం అధ్యక్షుడు వి.కృష్ణారావు.

## 'ఇండియన్-2' స్పెషల్ షో ఒక్క రోజే!


'ఇండియన్-2'లో కమల్ హాసన్

విశ్వనటుడు కమల్ హాసన్ నటించిన 'ఇండియన్-2' ప్రపంచ వ్యాప్తంగా శుక్రవారం విడుదలవుతుంది. శంకర్ దర్శకత్వంలో తమిళం, తెలుగు, కన్నడ, హిందీ, మలయాళ భాషల్లో రూపుదిద్దుకుంది. ఈ సినిమా రిలీజ్‌ను పురస్కరించుకుని ప్రత్యేక షోలకు అనుమతివ్వాలని చిత్ర నిర్మాణ సంస్థలు కోరగా, ప్రభుత్వం మాత్రం కేవలం ఒకే ఒక్క రోజు మాత్రమే స్పెషల్ షోకు అనుమతి ఇచ్చింది. విడుదల రోజైన శుక్రవారం మాత్రమే ఉదయం 9 గంటలకు స్పెషల్ షో (అదనపు ఆట) ప్రదర్శించేందుకు అనుమతిచ్చింది. గతంలో హీరో అజిత్ నటించిన 'తుణివు' విడుదల సమయంలో కోయంబేడులోని రోహిణి థియేటర్ వద్ద ఓ విషాదకర ఘటన జరిగింది. ఆ సమయంలో అజిత్ అభిమానుల్లో ఒకరు మరణించారు. అప్పటి నుంచి స్పెషల్ షోలకు అనుమతివ్వడం లేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం విడుదలయ్యే 'ఇండియన్-2'కు మాత్రం 12వ తేదీ ఉదయం 9 గంటల ఆటకు ప్రభుత్వం అనుమతిచ్చింది. కాగా, ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్, రాజ్‌కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, రెడ్ జెయింట్ మూవీస్ సంయుక్తంగా తెరకెక్కించాయి. ఇందులో రెడ్ జెయింట్ మూవీస్ రాష్ట్ర మంత్రి, సినీ హీరో ఉదయనిధి సొంత నిర్మాణ సంస్థ కావడం గమనార్హం.

చిత్రజ్యోతి

## రోమ్ కామ్ మూవీగా 'లవ్ ఇంక్'


కొత్త చిత్రం ప్రారంభోత్సవ పూజా దృశ్యం

ఎంఆర్ పిక్చర్స్ పతాకంపై నిర్మాత ఏ.మహేంద్రన్ ఆదికేశవన్ సమర్పణలో రాజ్ అయ్యప్ప - డెల్నా డేవిస్ జంటగా నటించే కొత్త చిత్రం పూజా కార్యక్రమం నగరంలో బుధవారం జరిగింది. రోమ్ కామ్ జానర్‌లో రూపొందే ఈ చిత్రానికి 'లవ్ ఇంక్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ చిత్రం ద్వారా మేఘనారాజ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'లవ్ ఇంక్' అనేది నేటి జనరేషన్‌లో బాగా ప్రాచుర్యం పొందింది. ప్రేమికులు లేదా యువతీయువకులు తమకిష్టమైన వ్యక్తులు లేదా ప్రేమ చిహ్నాలను టాటూలుగా వేయించుకోవడాన్ని 'లవ్ ఇంక్'గా పిలుస్తారు. తద్వారా తమ మధ్య బంధం, ప్రేమానురాగాలు పెరుగుతాయని వారు బలంగా విశ్వసిస్తారు. ఒక రకంగా చెప్పాలంటే పొసెసివ్‌నెస్‌కు సంబంధించి అప్‌గ్రేడ్ వెర్షన్. అలాంటి ప్రేమికుల చుట్టూ తిరిగే కథే 'లవ్ ఇంక్'. ఈ చిత్రం షూటింగ్ పూజా కార్యక్రమంతో ప్రారంభించాం. దర్శకుడిగా అవకాశం ఇచ్చిన నిర్మాతకు కృతజ్ఞతలు' తెలిపారు. విష్ణు విజయ్ సంగీతం అందించే ఈ చిత్రంలో వీటీవీ గణేష్, మునీష్కాంత్, అర్షద్, పట్టిమండ్రం రాజా, వినోదిని, మారన్, సుభాషిణి కన్నన్, కేపీవై వినోద్ తదితరులు నటిస్తున్నారు. మూడు షెడ్యూల్స్‌లో చెన్నై, తంజావూరు తదితర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుకోనుంది.

## అర్జున్ దాస్ - అదితి జంటగా కొత్త చిత్రం



అర్జున్ దాస్, అదితి శంకర్ జంటగా నటించే కొత్త చిత్రం షూటింగ్ బుధవారం నగరంలో ప్రారంభమైంది. 'ప్రొడక్షన్ నెం.4'తో ప్రారంభమైన ఈ చిత్రానికి విఘ్నేష్ శ్రీకాంత్ దర్శకత్వం వహిస్తున్నారు. అరవింద్ విశ్వనాథన్ ఛాయాగ్రహణం అందిస్తుండగా, కాస్ట్యూమ్ డిజైనర్‌గా నవ రాజ్‌కుమార్‌ను ఎంపిక చేశారు. పూర్తిస్థాయి వినోదాత్మకంగా తెరకెక్కించే ఈ చిత్రాన్ని మిలియన్ డాలర్ స్టూడియోస్ పతాకంపై యువరాజ్ గణేశన్ నిర్మిస్తున్నారు. ఫిన్‌టేమ్యాక్స్ వీఆర్ వంశీ సహ నిర్మాత. తన అద్భుతమైన గాత్రంతో పాటు అద్వితీయ నటనతో అభిమానులను సొంతం చేసుకున్న అర్జున్ దాస్, తమిళ చిత్రపరిశ్రమలో ప్రతిభతో నటిగా గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ అదితి శంకర్ కలిసి నటించే తొలి చిత్రం కావడంతో ఈ చిత్రంపై ప్రేక్షకులతో పాటు సినీ ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

## మీనాక్షికి మరో లక్కీ ఛాన్స్


మీనాక్షి గోవిందరాజన్

యువ హీరోయిన్ మీనాక్షి గోవిందరాజన్‌కు మరో మారు అదృష్టం వరించింది. సుశీంద్రన్ దర్శకత్వంలో మూడోసారి నటిస్తున్నారు. గతంలో సుశీంద్రన్ తెరకెక్కించిన 'కెన్నడి క్లబ్' చిత్రం ద్వారా హీరోయిన్‌గా వెండితెరకు పరిచయమైన మీనాక్షి.. ఆ తర్వాత సుశీంద్రన్ దర్శకత్వం వహించిన 'వీరపాండ్యపురం'లో నటించారు. ఇపుడు మరోమారు ఆయన దర్శకత్వంలో నటించే అవకాశాన్ని దక్కించుకున్నారు. ఈ చిత్రానికి '2కే లవ్ స్టోరీ' అనే పేరు ఖరారు చేయగా, జగవీర్ హీరోగా పరిచయమవుతున్నారు. సినిమా షూటింగ్ తాజాగా ప్రారంభంకాగా, దర్శకుడు పాండిరాజ్ తొలిక్లాప్ కొట్టారు. సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'చాలా గ్యాప్ తర్వాత మళ్ళీ దర్శకత్వ బాధ్యతలు చేపట్టాను. ఇది పూర్తిగా యువతకు సంబంధించిన స్టోరీ. 2కే జనరేషన్‌లో ప్రేమ, స్నేహం వంటి అంశాలు ప్రతిబింబించేలా ఉంటాయి. వెడ్డింగ్ ఫొటోగ్రఫీ వృత్తిలో కొనసాగే ఒక యువత బృందం జీవన ప్రయాణంలో చోటుచేసుకునే సంఘటనల ఆధారంగా ఈ స్క్రీన్‌ప్లే సాగుతుంది. కోయంబత్తూరు, చెన్నై ప్రాంతాల్లో ఈ సినిమాను చిత్రీకరిస్తాం' అని వివరించారు.

## డీఎంకే నేతలకు ఎంపీ కనిమొళి విందు

పెరంబూర్, జూలై 11: డీఎంకే నేతలకు ఎంపీ కనిమొళి విందు భోజనం పెట్టారు. ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో తూత్తుకుడి నియోజకవర్గం నుంచి పోటీచేసిన సిట్టింగ్ ఎంపీ కనిమొళి మళ్లీ విజయం సాధించారు. దీంతో, తన విజయానికి కృషిచేసిన పార్టీ నేతలకు కృతజ్ఞతలు తెలిపేలా విందు ఏర్పాటుచేశారు. తూత్తుకుడి పోల్‌పేటలోని ఓ కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన ఈ విందులో మాంసాహార, శాఖాహార భోజనం వడ్డించారు. ఈ విందులో ఎంపీ కనిమొళి, మంత్రి గీతా జీవన్, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.


నేతలతో ఎంపీ కనిమొళి, మంత్రి గీతా జీవన్ తదితరులు

## ఐటీ రంగంలో పెట్టుబడులు పెట్టండి

● మంత్రి పళనివేల్ త్యాగరాజన్ పిలుపు

చెన్నై, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఐటీ రంగంలో రాష్ట్రం రాకెట్ వేగంతో పురోగమిస్తోందని, ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ కంపెనీలన్నీ ముందుకురావాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి పళనివేల్ త్యాగరాజన్ పిలుపునిచ్చారు. గురువారం ఉదయం నగరంలోని స్టార్ హోటల్‌లో తమిళనాడు టెక్నాలజీ హబ్ (ఐటీఎన్టీ హబ్) ప్రథమ వార్షికోత్సవాలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రోల్స్ రాయిస్ వంటి సంస్థలు రాష్ట్రంలోని ఐటీ రంగంలో పెట్టుబడులు పెట్టడం అభినందనీయమన్నారు. ఈ సభలో కొత్త స్టార్టప్‌లు ప్రారంభించేందుకు వివిధ సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదిరాయి. ఈ వేడుకల్లో సీఐఐ స్టేట్ కౌన్సిల్ చైర్మన్ శీవత్స్ రామ్, ప్రభుత్వ ఐటీ శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ధీరజ్‌కుమార్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జయరంజన్, ఐటీఎన్టీ హబ్ సీఈఓ వనితా వేణుగోపాల్, రోల్స్ రాయిస్ ఇండియా ప్రెసిడెంట్ కిషోర్ జయరామన్ తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జె.జయరంజన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి పీటీఆర్ పళనివేల్ త్యాగరాజన్

## బీ-రైట్ పేరుతో సరికొత్త ఆయిల్ బ్రాండ్

● ఆవిష్కరించిన జీఈఎఫ్



కొత్త బ్రాండ్ లాంచ్ చేస్తున్న పి.చంద్రశేఖర రెడ్డి తదితరులు

అడయార్, జూలై 11: జెమినీ ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ (జీఈఎఫ్) ఇండియా లిమిటెడ్ కంపెనీ "బీరైట్" పేరుతో సరికొత్త బ్రాండ్ ఆయిల్ తమిళనాడు మార్కెట్‌లోకి ప్రవేశపెట్టింది. ఈ బ్రాండ్ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం నగరంలో జరిగింది. ఇందులో ఆ కంపెనీ సేల్స్ అండ్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్రశేఖర్ రెడ్డి, కంపెనీకి చెందిన పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో చంద్రశేఖర రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో నంబర్ వన్ సన్ ఫ్లవర్ ఆయిల్ కంపెనీగా గుర్తింపు పొందామన్నారు. ప్రస్తుతం జాతీయ స్థాయిలో తమ కంపెనీ 21.7 శాతం మార్కెట్ వాటా ఉందన్నారు. తాజాగా 'బీ-రైట్' పేరుతో సరికొత్త బ్రాండ్‌ను తమిళనాడు మార్కెట్‌లోకి ప్రవేశపెట్టినట్టు చెప్పారు. ఈ హైక్వాలిటీ బీ-రైట్ బ్రాండ్ ఉత్పత్తులు రాష్ట్రంలోని అన్ని రిటైల్ షాపులతో పాటు సూపర్ మార్కెట్లలో అందుబాటులో ఉంటాయన్నారు. సన్‌ఫ్లవర్ ఆయిల్ పరిశ్రమ సగటున 2.5 శాతం నుంచి 3 శాతం మేరకు వృద్ధి సాధిస్తుంటే తమ కంపెనీ గత ఐదేళ్లుగా 11.6 శాతం వృద్ధిని నమోదు చేస్తున్నామన్నారు. తమిళనాడు ఎడిబుల్ ఆయిల్ మార్కెట్ విభాగంలో సన్‌ఫ్లవర్ ఆయిల్ 42 శాతం మేరకు ఉందని, 83 శాతం గృహ అవసరాల కోసం వినియోగిస్తున్నారని తెలిపారు. తమ కంపెనీ 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.9 వేల కోట్లకు పైగా టర్నోవర్‌ను కలిగివుందన్నారు. వచ్చే ఐదేళ్లలో 10 నుంచి 15 శాతం మార్కెట్ వృద్ధిని సాధించాలని భావిస్తున్నామన్నారు.